క్లుప్తంగా

అన్నదానం గొప్పది



అన్నసమారాధన ప్రారంభిస్తున్న ఆలయ ఈఓ పద్మావతి, శంకరరెడ్డి, తదితరులు

విజయనగరం టౌన్: అన్ని దానాల కంటే అన్నదానం గొప్పదని కంటోన్మెంట్ గూడ్స్‌షెడ్ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ ఈఓ పద్మావతి అన్నారు. ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ రెయ్యి శంకరరెడ్డి నేతృత్వంలో మాస శివరాత్రి పురస్కరించుకుని గురువారం అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ, ఆలయ ఆవరణలో ఇటువంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగేవిధంగా చర్యలు చేపడతామన్నారు. ఆలయ అభివృద్ధికి దాతలు అందిస్తున్న సహాయ, సహకారాలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్‌బోర్డు సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

శరవేగంగా రోడ్డు పనులు



నిర్మాణ పనులను తనిఖీ చేస్తున్న డీఈ శ్రీనివాసరావు

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధిలోని జిల్లా డ్వామా కార్యాలయానికి వెళ్లే రోడ్డు నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. డ్వామా కార్యాలయాన్ని ప్రస్తుతం ఈవీఎం గొడౌన్–2గా వాడుతున్న విషయం తెలిసిందే. అయితే ఈ మధ్య గొడౌన్‌కు అధికారుల రాకపోకలు ఎక్కువగా సాగుతుండడంతో అత్యవసరంగా రూ. 3 లక్షలతో రోడ్డు వేస్తున్నారు. త్వరలోనే పనులు పూర్తి చేస్తామని ఆర్అండ్‌బీ డీఈ శ్రీనివాసరావు తెలిపారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



రుణ మంజూరు పత్రాలు అందిస్తున్న నాబార్డ్ డీడీఎం నాగార్జున

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సతివాడ గ్రామంలో ఆర్థిక అక్షరాస్యతపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నాబార్డ్ డీడీఎం నాగార్జున హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భూమి ఉండి అప్పు లేని రైతులందరూ రుణాలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా సైబర్ నేరాల బారిన ఖాతాదారులు పడకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. అనంతరం ఆర్థిక అక్షరాస్యతపై మ్యాజిక్ షో నిర్వహించారు. పలువురు రైతులకు రుణపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రేవళ్ల శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు రెడ్డి సత్యనారాయణ, ఏపీజీబీ మేనేజర్ షణ్ముఖరావు, ఏపీఎం సత్యనారాయణ, పీఏసీఎస్ సీఈఓ సన్యాసప్పడు పాల్గొన్నారు.

పర్యవేక్షణ చేపట్టాలి



మాట్లాడుతున్న నగర పాలక కమిషనర్ శ్రీరాములనాయుడు

విజయనగరం: నగరంలో అనధికార నిర్మాణాలు, ఆక్రమణల పట్ల నిరంతర పర్యవేక్షణ తప్పనిసరని ప్రణాళికా కార్యదర్శులకు నగర పాలక సంస్థ కమిషనర్ ఆర్. శ్రీరాములనాయుడు ఆదేశించారు. ఈ మేరకు గురువారం సాయంత్రం నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రణాళిక విభాగం అధికారులు, కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వారంలో రెండు రోజులు క్షేత్రస్థాయి తనిఖీలు విధిగా చేపట్టాలన్నారు. సమావేశంలో ఏసీపీ అమ్మాజీ రావు, సర్వేయర్ సింహాచలం, టపీబీఓ ఫిలిప్ పాల్గొన్నారు.

ఈవీఎంల పనితీరు పరిశీలిస్తాం..

నెల్లిమర్ల: ఈవీఎం గొడౌన్‌లోని ఓటింగ్ యంత్రాల పనితీరును అన్ని రాజకీయ పార్టీల సమక్షంలో పరిశీలిస్తామని కేఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఆర్‌వీ సూర్యనారాయణ అన్నారు. గురువారం స్థానిక ఈవీఎం గొడౌన్, డ్వామా కార్యాలయాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈనెల 16 నుంచి ఓటింగ్ యంత్రాల ఫస్ట్ లెవెల్ చెకింగ్ 20 రోజులు పాటు ఉంటుందన్నారు. ప్రతి మిషన్ కూడా బటన్ నొక్కి ఆరుసార్లు అందరి సమక్షంలో పరిశీలించి, అందరికీ ఆమోద యోగ్యం అయితే వినియోగిస్తామని చెప్పారు. 6000 ఓటింగ్ యంత్రాలు చెక్ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ డి. ధర్మరాజు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య రంగంలో విప్లవాత్మకమైన మార్పులు

• ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు



నెల్లిమర్ల రూరల్: గుషిణిలో మందుల కిట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

నెల్లిమర్ల రూరల్: ప్రజారోగ్యమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వైద్య రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చారని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని గుషిణిలో గురువారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం ముఖ్యమంత్రి జగనన్నతో సాధ్యమైందన్నారు. విద్య, వైద్య రంగాల్లో ముఖ్యమంత్రి తీసుకువచ్చిన నూతన సంస్కరణలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని చెప్పారు. అనంతరం వైద్య పరీక్షలు చేయించుకున్న వారికి మందుల కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అంబళ్ల సుధారాణి, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబళ్ల శ్రీరాములనాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు చనమళ్ల వెంకటరమణ, టూరిజం బోర్డు డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీలు పతివాడ సత్యనారాయణ, సారిక వైకుంఠం, ఎంపీటీసీ సభ్యురాలు చనమళ్ల స్వాతి, నాయకులు జమ్ము అప్పలనాయుడు, సత్తిబాబు, అధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం

పూసపాటిరేగ: అందరూ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలనే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి రూపకల్పన చేశారని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని కోనాడలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 577 మందిని వైద్య సిబ్బంది పరీక్షించి, అవసరమైన మందులు అందజేశారు. అలాగే 35 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించి, కళ్లద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శనను ఎమ్మెల్యే తిలకించారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ మహంతి శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ అల్లాడ రమేష్, ప్రజా ప్రతినిధులు మహంతి జనార్దనరావు, అమర గురువులు, దాడిశెట్టి త్రినాథరావు, బొడ్డు ఎల్లాజీ, దాడిశెట్టి గోవింద, దారపు లక్ష్మణరెడ్డి, డి. మహేష్, వి. కిరణ్, తహసీల్దార్ ఇ.భాస్కరరావు, ఎంపీడీఓ ఎం. రాధిక, ఈఓపీఆర్‌డీ శ్రీనివాసరావు, వైద్యాధికారులు రాజేష్‌వర్మ, తదితరులు పాల్గొన్నారు.



పూసపాటిరేగ: ఫైలేరియా బాధితులకు కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

డెంకాడలో..

డెంకాడ: ప్రజలు ఆరోగ్యంగా, ఆర్థికంగా బాగుండాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడు అన్నారు. మండలంలోని అమకాంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ స్వరూపారాణి, డీటీ సూర్యకాంతం, మోపాడ పీహెచ్‌సీ డాక్టర్ యోగితా బాల, వైఎస్సార్‌సీపీ నాయకులు బలసా అప్పారావు, రాంపిల్లి లోకేష్, దుర్గాసి ఆనంద్, భీము నాయుడు, పలు విభాగాలకు చెందిన డాక్టర్లు, అధికారులు,సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



డెంకాడ: అమకాంలో రోగులకు మందులు అందజేస్తున్న ఎంపీపీ, వైస్ ఎంపీపీ, తదితరులు

భోగాపురంలో..

భోగాపురం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో ప్రజల ఆరోగ్యానికి రక్షణ కలుగుతుందని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు పిలుపునిచ్చారు. మండలంలోని కవులవాడ పంచాయతీ పరిధిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన జగనన్న సురక్ష శిబిరాన్ని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, కొండపు కొత్తయ్యరెడ్డి, రాజారెడ్డి, తహసీల్దార్ చింత బంగార్రాజు ఎంపీడీఓ నీలం అప్పలనాయుడు, ఈఓపీఆర్‌డీ సురేష్, పోలిపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి టి. తిరుపతిస్వామి, వైద్యులు సహన సంతోషి, వెంటేశ్వరరావు, పి. రమ్యశ్రీ, సెక్రటరీ జి. సంతోష్‌కుమార్, సచివాలయ సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనే ధ్యేయం

• డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



45వ డివిజన్‌లో నూతన రోడ్డు ప్రారంభోత్సవంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, తదితరులు

విజయనగరం: కార్పొరేషన్ పరిధిలోని శివారు ప్రాంతాల్లో సైతం మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. నగరంలోని 45, 46 డివిజన్‌ల పరిధిలో నూతనంగా నిర్మించిన రోడ్లను నగర మేయర్, స్థానిక కార్పొరేటర్లతో కలిసి గురువారం ప్రారంభించారు. ఇందులో భాగంగా కేఎల్‌పురంలోని జెండా జంక్షన్‌లో రూ.9 లక్షలతో నిర్మించిన రోడ్డుతో పాటు కణపాక పైడిమాంబ కాలనీలో రూ.11 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించి ప్రజా వినియోగంలోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా 45వ డివిజన్ కార్పొరేటర్ తాళ్లపూడి సంతోషికుమారి మాట్లాడుతూ, తమ డివిజన్ అభివృద్ధికి డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఇస్తున్న తోడ్పాటును ప్రజలు మర్చిపోలేరన్నారు. ఎన్నో ఏళ్లుగా తాగు నీటి కష్టాలు ఎదుర్కొన్న తమ కాలనీ వాసుల దాహార్తిని తీర్చేవిధంగా రూ.3 కోట్లతో వాటర్ ట్యాంక్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారని ఆనందం వ్యక్తం చేశారు. రోడ్లు, కాలువలు ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన సౌకర్యాలను కల్పిస్తున్నారని చెప్పారు. అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయడమే కాకుండా వాటిని పూర్తి చేసి ప్రారంభోత్సవాలు కూడా చేయడం గొప్ప విషయమన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు రమణమూర్తి మాట్లాడుతూ, కేఎల్ పురం ప్రాంతాన్ని ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దేందుకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి, స్థానిక ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామికి అండగా నిలబడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, 46వ డివిజన్ కార్పొరేటర్ బొద్దూరు గోవిందమ్మ, జోనల్ ఇన్‌చార్జ్‌లు తమ్ము, దూబే, తాళ్లపూడి పండు, బొద్దూరు లక్ష్మణరావు, పైడితల్లి పాల్గొన్నారు.

పేదలకు వైద్యసేవలు అందించడమే లక్ష్యం

• సాయి ఆస్పత్రి ఎం.డి డాక్టర్ శ్రీరామ్మూర్తి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీరామ్మూర్తి

విజయనగరం ఫోర్ట్: పేదలకు వైద్య సేవలందించడమే తమ లక్ష్యమని సాయి ఆస్పత్రి ఎం.డి డాక్టర్ అక్కెన శ్రీరామ్మూర్తి తెలిపారు. గురువారం స్థానిక సాయి ఆస్పత్రిలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, సత్య సాయిబాబా 98వ పుట్టిన రోజు సందర్భంగా ఈ ఏడాది 98 ఉచిత ఆపరేషన్లు చేయడానికి నిర్ణయించినట్లు తెలిపారు. ఇందులో భాగంగానే తెలంగాణ రాష్ట్రం కోదాడ పట్టణానికి చెందిన మందవ నిఖిల్ అనే యువకుడికి ఈఎన్‌టీ వైద్యుడు సతీష్ విజయవంతంగా శస్త్ర చికిత్స నిర్వహించాడన్నారు. సమావేశంలో అక్కెడ లక్ష్మి, డాక్టర్ బాల నాగశ్రీకర్, తదితరులు పాల్గొన్నారు.

నేడు నూతన భవనాలు ప్రారంభం



గుడివాడలో ప్రారంభోత్సవానికి సిద్ధమైన గ్రామ సచివాలయం భవనం



ప్రారంభం కానున్న ఆర్‌బీకే భవనం

భోగాపురం: మండలంలోని గుడివాడలో నిర్మించిన ప్రభుత్వ భవనాలను శుక్రవారం ప్రారంభించనున్నట్లు ఎంపీడీఓ నీలం అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ, గ్రామ శివారులో రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనం, రూ.23.94 లక్షలతో నిర్మించిన రైతుభరోసా కేంద్రం ప్రారంభించడంతో పాటు జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా రూ.94.3 లక్షలతో చేపట్టనున్న ఇంటింటా కుళాయి పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు.

బెంచీల ఏర్పాటు

భోగాపురం: మండలంలోని పోలిపల్లి గ్రామంలో ఉన్న రెండు శ్మశానవాటికల్లో రూ. 50 వేల విలువ చేసే 15 బెంచీలను సర్పంచ్ కర్రోతు వెంకటరమణ ఏర్పాటు చేశారు. తన తండ్రి కర్రోతు పైడన్న జ్ఞాపకార్థం టేబుల్స్ ఏర్పాటు చేసినట్లు వెంకటరమణ తెలిపారు.



ఏర్పాటు చేసిన బెంచీలు

సృజనాత్మకత వెలికితీసేందుకే పోటీలు



మాట్లాడుతున్న కార్పొరేషన్ విద్యా కమిటీ ప్రతినిధి బాలి పద్మావతి

విజయనగరం: నవంబర్ 14 బాలల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వివిధ విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు విజయనగరం కార్పొరేషన్ పాలకవర్గం విద్యాకమిటీ తెలిపింది. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకే పోటీలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు చెప్పారు. ఈ మేరకు నగర పాలక సంస్థ కార్యాలయంలో వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. నగరంలో మొత్తం 45 ప్రాథమిక పాఠశాలలు ఉండగా.. ఆయా పాఠశాలల్లో పోటీలు ఎలా నిర్వహించాలన్నదానిపై సమీక్షించారు. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు 2,681 మంది ఉండగా.. వీరికి పోటీలు నిర్వహించేందుకు 178 మంది ఉపాధ్యాయులు సహకరించనున్నట్లు తెలిపారు. వక్తృత్వం, చిత్రలేఖనం, క్విజ్ , ఫ్యాన్సీడ్రెస్ వంటి విభాగాలలో పోటీలు నిర్వహించి, విజేతలకు నవంబర్ 14న బహుమతులు ప్రదానం చేయనున్నారు. స్తున్నట్లు వివరించారు. సమావేశంలో విద్యా కమిటీ సభ్యులు బాలి పద్మావతి, తొగురోతు సంధ్యారాణి, తాళ్లపూడి సంతోషికుమారి, మండల విద్యాశాఖ అధికారి రాజు, సత్యవతి, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

నైపుణ్యాలను సద్వినియోగం చేసుకోండి

• ఎమ్మెల్సీ రవివర్మ



ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్సీ రవివర్మ

విజయనగరం అర్బన్: శిక్షణలో నేర్చుకున్న నైపుణ్యాలను ఉపాధి, ఉద్యోగావకాశాలకు సద్వినియోగం చేసుకోవాలని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పి. రవివర్మ సూచించారు. గురువారం స్థానిక ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలో నిర్వహించిన 'స్కిల్ కాన్వికేషన్ సెర్మనీ' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, విభిన్న రంగాల్లో నైపుణ్యం ఉన్న యువత వైపు దేశం చూస్తోందన్నారు. అనంతరం కోర్సు పూర్తయిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ఐటీఐ ప్రిన్సిపాల్ టీవీ గిరి మాట్లాడుతూ, కోర్సు పూర్తి చేసుకున్న ప్రతి ఒక్కరూ ఉద్యోగాల్లో స్థిరపడాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఐటీఐ శిక్షణాధికారి రామాచారి, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

డెంకాడ: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం రెండు వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ పి. అప్పలస్వామినాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల నిర్వహణ, ఇతర పనుల నేపథ్యంలో జొన్నాడ 11 కేవీ రూరల్ ఫీడర్ పరిధిలోని జొన్నాడ, దువ్వపేట, మన్యాపేట, గొలగానిపేట, ఆకులపేట, డి.తాళ్లవలస, కృష్ణాపురం, రఘుమండ, గుండాలపేట, చిట్టిగుంకలాం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. అక్కివరం రూరల్ ఫీడర్ పరిధిలోని మాన్యంకల్లాలు, అక్కివరం, గంట్లాం పార్ట్, గొలగాం, డి.తాళ్లవలసలలో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

సిరిమాను చెట్టును దర్శించుకున్న ఆర్డీఓ సూర్యకళ

నెల్లిమర్ల: ఉత్తరాంధ్రుల కల్పవల్లి పైడితల్లి అమ్మవారి సిరిమాను చెట్టును అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటున్నారు. ఈ క్రమంలో జరజాపుపేటలో గుర్తించిన సిరిమాను చెట్టును విజయనగరం ఆర్డీఓ ఎంవీ సూర్యకళ గురువారం దర్శించుకున్నారు. అనంతరం ఆమె కమిటీ సభ్యులతో మాట్లాడుతూ, సిరిమాను చెట్టు విజయనగరం తరలించేటప్పుడు చేయాల్సిన ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. ముఖ్యంగా ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, తహసీల్దార్ డి. ధర్మరాజు, డీటీ డి. శైలజ, రెవెన్యూ సిబ్బంది, పూజారి వెంకటరావు పాల్గొన్నారు.



సిరిమాను చెట్టువద్ద పూజలు చేస్తున్న ఆర్డీఓ సూర్యకళ

ఆధ్యాత్మిక భావాలు తప్పనిసరి



ధర్మ ప్రచార వారోత్సవాల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

• ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

నెల్లిమర్ల రూరల్: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక భావాలు కలిగి ఉండాలని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. దేవదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో రామతీర్థంలో జరుగుతున్న కళారాధన కార్యక్రమాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు మాట్లాడుతూ, దేవాలయాల్లో ధర్మ ప్రచార వారోత్సవాలు నిర్వహించడం గొప్ప విషయమన్నారు. హైందవ ధర్మ పరిరక్షణే లక్ష్యంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. మన సంస్కృతీ, సంప్రదాయాలను భావితరాల పౌరులకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అనంతరం కళాకారులను అభినందించి ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ఈఓ కిషోర్‌కుమార్, ట్రస్టుబోర్డు సభ్యులు సత్యనారాయణ రాజు, బూర్లి సత్యం, నాగ ఇందు, శ్రీనివాసరావు, కంచరాపు రాము, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలందరిపై పైడితల్లి ఆశీస్సులు

• డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: పైడితల్లి అమ్మవారి ఆశీస్సులు ప్రతి ఒక్కరి పైనా ఉండాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఆకాంక్షించారు. నగరంలోని ఢకిని వీధి, తదితర ప్రాంతాల్లో అమ్మవారికి గురువారం చల్లదనాలు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కోలగట్ల మాట్లాడుతూ, అమ్మవారి పండగను అందరూ భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని సూచించారు. అనంతరం స్థానిక కార్పొరేటర్ బవిరెడ్డి సతీష్ మాట్లాడుతూ, పైడితల్లి జాతర మహోత్సవాలలో భాగంగా మూడు రోజుల పాటు చల్లదన కార్యక్రమాలు చేపడతామన్నారు. తమ ప్రాంతం నుంచి ఘటాలను ఊరేగింపుగా తీసుకెళ్లి తొలిరోజు మరిడమ్మ, నూకాలమ్మ.. రెండో రోజు పైడితల్లి, మూడో రోజు ముత్యాలమ్మకు ఘటాలను సమర్పిస్తామన్నారు. కార్యక్రమంలో రామేశ్వరపు రామారావు, జాడే తులసీరావు, అంబళ్ల శివకుమార్, ఉమ, తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారి చల్లదనం కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

వయోజన విద్యపై అవగాహన



వలంటీర్లకు విద్యాసామాగ్రి అందిస్తున్న నిర్వాహకులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని పారసాంలో స్వచ్ఛ ఉదయ్ సేవా వికాస్ సంస్థ ఆధ్వర్యంలో వయోజన విద్యపై గురువారం అవగాహన కల్పించారు. సంస్థ కో ఆర్డినేటర్ శివ గణేష్‌రెడ్డి, టూరిజం బోర్డు డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు సంగం రెడ్డి జగన్నాథం మాట్లాడుతూ, గ్రామాల్లో నిరక్షరాస్యులు ఉండకూడదనే ఉద్దేశంతో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం వలంటీర్లకు విద్యాసామాగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు పాల్గొన్నారు.

అదృశ్యమైన వ్యక్తి మృతదేహం గోస్తనిలో లభ్యం

పద్మనాభం: విజయనగరం జిల్లా నెల్లిమర్ల మండలం జారజాపుపేటలో అదృశ్యమైన వ్యక్తి మృతదేహం పద్మనాభం మండలం పాండ్రంగి సమీపంలోని గోస్తని నదిలో లభ్యమైనట్టు సీఐ ఎస్. సన్యాసినాయడు తెలిపారు. సీఐ అందించిన వివరాలిలా ఉన్నాయి. జారజాపుపేట గ్రామానికి చెందిన బాయి సూర్యనారాయణ(64) ఈ నెల 3వ తేదీ నుంచి కనిపించడంలేదని నెల్లిమర్ల పోలీస్ స్టేషన్‌లో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. దీనిపై నెల్లిమర్ల పోలీసులు సూర్యనారాయణ అదృశ్యమైనట్టు కేసు నమోదు చేశారు. సూర్యనారాయణకు మద్యం అలవాటు ఉంది. తన సొంత గ్రామమైన ఆనందపురం మండలం బోని వచ్చి మద్యం సేవించి సమీపంలోని గోస్తని నది ఒడ్డున మూడు రోజుల క్రితం సూర్యనారాయణ కాల కృత్యాలు తీర్చుకుంటుండగా కాలు జారి నదిలో పడి మృతి చెంది ఉంటాడని ఫిర్యాదు చేశారు. సూర్యనారాయణ మృతదేహం గురువారం పద్మనాభం మండలం పాండ్రంగి సమీపంలోని గోస్తని నదిలో కనిపించింది. దీనిపై సూర్యనారాయణ కుమారుడు దుర్గారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.